క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు కోసం వినతి

మామిడికుదురు: అమలాపురం నుంచి అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి వారి దేవస్థానానికి ఆర్టీసీ సర్వీసు ఏర్పాటు చేయాలని కోరుతూ మామిడికుదురు మండలం పాశర్లపూడికి చెందిన అక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం కోరారు. ఈ మేరకు అమలాపురం ఆర్టీసీ సూపరింటెండెంట్ సాయిబాబాను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన అప్పనపల్లికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు గంగాధరం తెలిపారు.

అన్నింటికీ చదువే కీలకం

అంబాజీపేట: పోటీ ప్రపంచంలో చదువే కీలకమని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం బి.శేషగిరిరావు అధ్యక్షత వహించారు. సర్పంచ్, వైస్ ఎంపీపీలు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు ప్రతి సబ్జెక్టును ఇష్టంతో చదివితే పబ్లిక్ పరీక్షలు సులభతరం అవుతాయన్నారు.

నాణ్యతగా వండాలి

కొత్తపేట: పాఠశాలల్లో పిల్లలందరూ ఇష్టంగా భుజించేలా మధ్యాహ్న భోజనం వండి వడ్డించాలని ఎంఈఓ-2 కె.లీలావతి నిర్వాహకులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనం వంటలను తనిఖీ చేశారు. పథకం ఏజెన్సీ నిర్వాహకుల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతిరోజు మెను ప్రకారం శుచిగా, శుభ్రంగా వండి వడ్డించాలని సూచించారు. హెచ్‌ఎం రంకిరెడ్డి రామకృష్ణమూర్తి ఉన్నారు.

ఉత్తమ అర్చక పురస్కార ప్రదానం

అంబాజీపేట: శైవాగమ సంప్రదాయం ప్రకారం నూరు ప్రతిష్ఠలకు పైబడి నిర్వహించిన శైవాగమ సామ్రాట్ పుల్లేటికుర్తి సత్యనారాయణ శర్మ పూజ్యనీయుడని ఆదిశైవ అర్చక సంఘ మండల అధ్యక్షుడు కొత్తలంక విజయ భాస్కరుడు అన్నారు. మొసలపల్లిలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణశర్మకు ఉత్తమ అర్చక పురస్కారాన్ని గురువారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శర్మ దంపతులను ఘనంగా సన్మానించారు.

నీళ్ల ట్యాంకులు వినియోగంలోకి తేవాలి

అంబాజీపేట: నిరుపయోగంగా ఉన్న ఐదు ట్యాంకులను వారం రోజుల్లోగా వినియోగంలోకి తేవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని డీపీఓ డి.రాంబాబు హెచ్చరించారు. పుల్లేటికుర్రులో ఉన్న వాటర్ ట్యాంకులను డీఈ ఏఎన్‌వీ పద్మనాభంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. వాటర్ ట్యాంకులకు చిన్న మరమ్మతులు చేసి ప్రజలకు రక్షిత మంచి నీరు ఇవ్వవచ్చని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.చలమయ్య, పంచాయతీ కార్యదర్శి వీవీ రమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా పైపులైన్ల లీకేజీలను, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ బి.మమత, వార్డు సభ్యులు దొమ్మేటి సురేష్ ఉన్నారు.

వంతెనకు మరమ్మతులు

మలికిపురం: అధ్వాన స్థితిలో ఉన్న దిండి-చించినాడ బ్రిడ్జిని జాతీయ రహదారుల శాఖ అధికారులు గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మానవతా మూర్తులు సామాజిక సేవా సంస్థ చేసిన ఆందోళన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఆందోళనకారులు గురువారం కూడా ఆందోళన చేపట్టారు. అక్టోబర్‌లో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

అధికారులు విధిగా హాజరు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మామిడికుదురు: మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అధికారులు విధిగా హాజరు కావాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవంటూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. పెదపట్నంలంక వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉందని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య చెప్పారు. వరదల సీజన్ కావడంతో తీర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి అందుబాటులో ఉండడం లేదని సర్పంచ్ జాలెం రమణకుమారి తెలిపారు. పాడైన స్లూయిజ్‌లను వెంటనే అభివృద్ధి చేయాలని సర్పంచ్ అడబాల తాతకాపు కోరారు. నాలుగు స్లూయిజ్‌ల ఆధునీకరణకు రూ.12.88 కోట్లతో అంచనాలు పంపామని హెడ్ వర్క్స్ ఏఈ టీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఈదరాడ, మగటపల్లి పంట కాలువల అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ తెలిపారు. పాడైన రోడ్లను 15 రోజుల్లో బాగు చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి, ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి



కూటమి నేతలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలి. ఎంత మంది పిల్లలు చదువుతుంటే, వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల వంతున ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పుడు ఒకరికి మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఒకరు ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి, మరొకరు ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి.

– కోట దివ్యలత, పి.గన్నవరం

ఇంకా రాలేదు



మా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం వస్తుందని ఎదురుచూస్తున్నాం. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు దీనిపైనే ప్రధానంగా ప్రచారం చేశారు. ఇప్పుడేమో ఒక్కరికే ఇస్తామని చెప్పడం దారుణం. ఇంటిలో ఎంత మంది చదువుతుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. నేటికీ ఇవ్వలేదు. మోసపూరిత వాగ్దానాలతో ఓట్లు దండుకున్నారు. తల్లికి వందనం పేరుతో మోసం చేయడం దారుణం.

– చప్పిడి అరుణకుమారి, అంబాజీపేట

ఎదురు చూస్తున్నాం



మాకు ఇద్దరు ఆడ పిల్లలు. వారిలో ఒక పాప మూడో తరగతి, మరో పాప నాలుగో తరగతి చదువుతున్నారు. గత జగన్ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద నగదు ప్రోత్సాహం ఒకరికే ఇచ్చినా, జూన్ నెలలోనే ఇచ్చేవారు. ఈ ఏడాది ఇంకా జమ చేయలేదు. పైగా ఎంతమంది పిల్లలు స్కూలుకు వెళితే, అంతమందికీ రూ.15 వేల వంతున ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తున్నాం. కానీ ఇప్పుడు ఒక్కరికే ఇస్తామంటున్నారు. ఇది భావ్యమా? ఇచ్చిన హామీ ప్రకారం ఇద్దరికీ ఆ సాయం అందజేసి ప్రోత్సహించాలని కోరుతున్నాం.

– మామిడిశెట్టి దుర్గ, విద్యార్థినుల తల్లి, గంటి పల్లిపాలెం, కొత్తపేట మండలం

ముగ్గురు పిల్లలకూ ఆశిస్తున్నా..



నాకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరు 7, 8, 9 తరగతులు చదువుతున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూల్లో జాయిన్ చేశాను. జగన్ ప్రభుత్వ హయాంలో పాపకు నాలుగేళ్లు అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ముగ్గురు పిల్లలకూ ఇస్తారని ఆశిస్తున్నా.

– రుద్రరాజు సాయిదేవి, ఊబలంక

ఒక్కరికే.. వందనమా..!



మామిడికుదురు ఉన్నత పాఠశాల విద్యార్థినులు

- మాట ఇవ్వడం.. తప్పడం టీడీపీ అధినేతకు అలవాటే..
- ఈసారీ అదే పరిస్థితేనా!
- ఇంకా అమలుకాని 'తల్లికి వందనం'
- ప్రతి విద్యార్థికీ ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఇప్పుడు ఇంటికి ఒక్కటేనంటూ ఫ్లేటు ఫిరాయింపు

కొత్తపేట: పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తప్పనిసరిగా పిల్లలను బడికి పంపించాలని ప్రతి తల్లిని కోరుతున్నా.. మన పిల్లల బాగు కోరే ప్రభుత్వంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం.. పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే తపన, తాపత్రయంతో అడుగులు ముందుకు వేస్తున్నాం..

2023-24లో జగన్ ప్రభుత్వ ప్రోత్సాహమిలా..

నియోజకవర్గం	తల్లులు	ప్రోత్సాహం (రూ.కోట్లలో)
కొత్తపేట	25,192	31.73
పి.గన్నవరం	22,031	28.62
రాజోలు	17,643	22.92
మొత్తం	64,866	84.27

ఇందులో భాగంగా తొలి దశలో పిల్లల భవిష్యత్తు కోసం వారిని బడికి పంపించినందుకు ప్రోత్సాహకంగా 'అమ్మఒడి' పేరిట పథకాన్ని ప్రవేశపెడుతున్నా' అంటూ 2019లో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020-21 విద్యా సంవత్సరం నుంచి పిల్లలను బడికి పంపిస్తున్న తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున జమ చేశారు. క్రమం తప్పకుండా నాలుగేళ్లు ఆ ప్రోత్సాహాన్ని అందించారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. 'ఒక ఇంట్లో ఒక్కరికి కాదు, ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే వారందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలకు జమ చేస్తాం' అని హామీ ఇచ్చారు. విస్తృతంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇదొకటి. అమ్మ ఒడి పథకాన్ని కాస్తా 'తల్లికి వందనం' గా పేరు మార్చారు.

రేవు దాటాక.. చందాన

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీరు ఎప్పుడూ రేవు దాటాక తెప్ప తగలేసిన చందంగానే ఉంటుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు చెప్పేదొకటి.. తీరా అధికారం చేపట్టాక చేసేదొకటి. దానికనుగుణంగానే తల్లికి వందనం పథకానికి సంబంధించి చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం బుధవారం జీఓ నంబరు 29 జారీ చేసింది. దానిలో తల్లికి వందనం పథకం కింద ఒక తల్లికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. దీనికి పలు నిబంధనలు పేర్కొంటూ, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ (ప్లస్2) వరకూ తమ పిల్లలను పాఠశాలలు/కళాశాలలకు పంపేవారికి పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఒక ఇంట్లో నుంచి బడికి, కళాశాలకు వెళ్లే ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అని కాకుండా, ఒక్క తల్లికి మాత్రమే రూ 15 వేలు ఇవ్వనున్నట్టు తాజాగా ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలున్నా.. ముగ్గురు పిల్లలున్నా పథకాన్ని వర్తింపజేయాలని పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత జగన్ ప్రభుత్వం జూన్ నెలలో పాఠశాలలు తెరిచాక అదే నెలలో అమ్మఒడి పథకం సొమ్మును జమ చేసేవారు. ఈ మేరకు గతేడాది జూన్ 28న తల్లుల ఖాతాల్లో ప్రోత్సాహం నగదు జమ చేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం పాఠశాలలు తెరిచి నెల కావస్తున్నా, ఇంకా నగదు జమ చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వెంటనే తమ ఖాతాలకు సొమ్ము జమ చేయాలని కోరుతున్నారు.

ఒక్కరికే ఇవ్వడం అన్యాయం



మాకు ఇద్దరు సంతానం. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలను అంతర్వేదిపాలెం ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాం. తల్లికి వందనం పథకాన్ని ఇపుడు కేవలం ఇంటికి ఒకరికే అమలు చేస్తామనడం అన్యాయం. రెండో పిల్లవాడి చదువు భారం మాపై పడుతుంది.

– రాపాక మహాని మాధవి, ఉయ్యూరువారి మెరక

మాట మార్చడం తగదు



మాకు ఇద్దరు సంతానం. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అని మేనిఫెస్టోలో కూటమి నేతలు హామీ ఇచ్చి, ఇపుడు మాట మార్చారు. వారిని నమ్మి ఇద్దరు పిల్లలను మోరిలోని ప్రైవేటు స్కూల్‌కు పంపుతున్నాం. ఇపుడు కేవలం ఒకరికే పథకం వర్తింపజేస్తే, రెండో పిల్లకు ఫీజుల భారం మాపై పడుతుంది.

– నల్లి రమాకుమారి, ఉయ్యూరువారి మెరక

ఇంకా ఇవ్వలేదు



గత ప్రభుత్వంలో జూన్ నెలలోనే అమ్మఒడి పథకం మా చిన్న బాబుకి ఇచ్చారు. మా ఇద్దరు పిల్లలు రావులపాలెంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదు. మా ఇద్దరు పిల్లలకూ తల్లికి వందనం పథకం ఇవ్వాలని కోరుతున్నాను.

– దూలం విజయదుర్గ, ర్యాలీ

అందరికీ వర్తింపజేయాలి



తల్లికి వందన పథకం ఎంతమంది పిల్లలున్నా వర్తింపజేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు ప్రకటించారు. నాకు ఇద్దరు సంతానం. ఈ పథకం అమలైతే మా ఇద్దరి పిల్లల చదువులకు మెరుగ్గా ఉంటుందని భావించాం. ఇప్పుడు మాట మారిస్తే ఎలా.!

– దొండపాటి ఆశాజ్యోతి, పడమటిపాలెం, మలికిపురం మండలం

రూ.30 వేలు ఇవ్వాల్సిందే...



ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదివే ఒకొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు చెప్పారు. ఇప్పుడు ఒక్కరికే నగదు జమ చేస్తామని చెబుతున్నారు. ఇది పూర్తిగా అన్యాయం. పది, తొమ్మిది తరగతులు చదువుతున్న నా ఇద్దరు పిల్లలకు రూ.30 వేల నగదు వేయాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాల్సిందే.

– నబ్బితి దేవయాని, నేదునూరు, అయినవిల్లి మండలం

నెల తిరక్కుండానే..

మామిడికుదురు: తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో వాగ్దానం చేశారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం సాయం అందిస్తామన్నారు. ఈ హామీని ప్రజలు నమ్మారు. కానీ, దానికి భిన్నంగా నేడు కుటుంబంలో ఒక్కరికే తల్లికి వందనం సాయం అందిస్తామంటూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నెల రోజులు తిరక్కుండానే హామీని విస్మరించడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గంలో గణాంకాలు, తల్లిదండ్రుల ఆవేదనను పరిశీలిద్దాం.

నేటి పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం నియోజకవర్గంలోని పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో 291 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. వాటి పరిధిలో మొత్తం 13,424 మంది చదువుకుంటున్నారు. ఎన్నికల హామీ మేరకు నియోజకవర్గంలో 13,424 మందికి తల్లికి వందనం సాయం అందించాల్సి ఉంది. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

నాడు 18 వేల మందికి ప్రయోజనం

అమ్మ ఒడి పథకం ద్వారా పి.గన్నవరం నియోజకవర్గంలో గతంలో 18,402 మంది విద్యార్థులకు సాయం అందింది. పి.గన్నవరం మండలంలో 5,796 మంది, అంబాజీపేటలో 4,258 మంది, మామిడికుదురులో 3,636 మంది, అయినవిల్లి మండలంలో 4,712 మందికి సాయం అందింది.

గోగన్నమఠం డ్రెయిన్ పునరుద్ధరణే కీలకం

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అత్యంత దుర్భరంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని సముద్రతీర గ్రామాల్లో పర్యటించారు. ఆక్రమణకు కనుమరుగైన గోగన్నమఠం డ్రెయిన్‌ను పునరుద్ధరించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వైన తేయ నది నుంచి సముద్ర తీరం వెంబడి ఉన్న గోగన్నమఠం డ్రెయిన్ సుమారు ఎనిమిది కి.మీ. మేర పూర్తిగా ఆక్రమణలకు గురైందన్నారు. అందువల్లే శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ సక్రమంగా పని చేయడం లేదన్నారు. పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం శంకరగుప్తం డ్రెయిన్ డ్రెడ్జింగ్ చేయడం వల్ల దీని పనితీరు మరింత క్షీణించిందన్నారు. ఫలితంగా నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో పంట పండడం లేదన్నారు. తాగునీటి సమస్య కూడా తలెత్తి బావుల్లో ఉప్పునీరు వస్తోందన్నారు. ఆయా గ్రామాల ప్రజల సహకారంతో గోగన్నమఠం డ్రెయిన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ఆక్రమిత చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఏడీ, ఏఈలను ఆదేశించారు. కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో పర్యటించి చనిపోయిన కొబ్బరి చెట్లను, ముంపునకు గురైన పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, సర్పంచ్‌లు యెనుముల నాగు, మందపాటి నాగేశ్వరరావు, గుర్లింక సత్యనారాయణ, ఆకుల చిన వెంకన్నాయుడు, అడబాల నగేష్, జక్కంపూడి శ్రీదేవి, కల్వకొలను దొరబాబు, అడబాల రాంబాబు తదితరులు ఉన్నారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం

ఆలమూరు: జొన్నాడలో ఇసుక నిల్వల ఉచిత విక్రయాలను గురువారం ప్రారంభించారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ ఈ విక్రయాలను బుధవారం సాయంత్రం ప్రారంభించగా, గురువారం నుంచి పూర్తి స్థాయిలో ఇసుక విక్రయాలు మొదలయ్యాయి. రెవెన్యూ, గ్రామ సచివాలయ, వెలుగు విభాగాల అధికారులు ఇసుక ఎగుమతులను పర్యవేక్షించారు. డిజిటల్ విధానంలో చెల్లింపులు జరిగాయి. తొలి రోజు యంత్రాల సాయంతో 59 వాహనాలకు ఇసుకను ఎగుమతులు చేయగా, అందులో 55 లారీలు, నాలుగు ట్రాక్టర్లు ఉన్నట్టు తహసీల్దార్ డీవీఎస్ కుమార్ తెలిపారు.

గ్రామాల్లో జీవ నియంత్రణ కేంద్రాలు

ఎంపీ హరీష్ మాథుర్



బదనికలను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

అంబాజీపేట: కొబ్బరి తోటలకు అపార నష్టం కలిగిస్తున్న రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో జీవ నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమలో కొబ్బరిపై ఇరియోఫిడ్ మైట్ (ఎర్రనల్లి), తెల్లదోమల వల్ల దిగుబడులు తగ్గాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే జీవ నియంత్రణ బదనికలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కొబ్బరి రైతులను ఆదుకోవడంలో భాగంగా ఉప ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను తట్టుకునేలా నూతన హైబ్రీడ్ వంగడాలపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలను కోరారు. కోకో పంటకు కనీస మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. రైతులకు యంత్ర పరికరాలు రాయితీపై అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్ర అధిపతి ఎన్‌బీవీ చలపతిరావు తమ కార్యకలాపాలను ఎంపీకి వివరించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.

జస్టిస్ స్వామి సేవలు అజరామరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి

అయినవిల్లి: జస్టిస్ బీఎస్ఏ స్వామి సేవలు అజరామరమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. గురువారం జస్టిస్ బీఎస్ఏ స్వామి జయంతిని ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో నిర్వహించారు. ఎమ్మెల్సీతో పాటు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత స్వామి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని వీరు ప్రారంభించారు. కళాశాల రెసిడెన్షియల్ డైరెక్టర్ కుమారస్వామి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉన్నతి' బకాయి రూ.47.63 లక్షలు

రికవరీ 8.22 శాతం మాత్రమే..

ఆలమూరు: వెలుగు శాఖలో అమలు చేస్తున్న ఉన్నతి పథకానికి సంబంధించి మండలంలో రూ 47.63 లక్షలు రికవరీ పెండింగ్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ పథకంలో నిధుల రికవరీలో దుర్వినియోగం జరిగిందంటూ ఆలమూరులో జిల్లా ఉన్నతాధికారులైన స్త్రీనిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి, డీపీఎం ఎం.శామ్యూల్ పలు దఫాలుగా జరిపిన విచారణ బుధవారం రాత్రి పూర్తయ్యింది. మండలంలో 30 గ్రామ మహిళ సంఘాలుండగా, ఇప్పటి వరకూ ఆలమూరు-1లో మాత్రమే రూ 3.73 లక్షల మేరకు సక్రమంగా చెల్లింపులు జరగలేదని నిర్ధారించారు. 2016 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ రూ.15.71 కోట్ల మేర రుణాలివ్వగా, యానిమేటర్లు రూ 47.56 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది. అయితే 15 మంది యానిమేటర్లు రుణాల సేకరింపులో నిర్లక్ష్యం వహించారని 8 మంది 23 నుంచి 92 శాతం మేర రుణాలను రికవరీ చేసినట్టు గురువారం వెలుగు శాఖ విడుదల చేసిన గణాంకాల్లో తేటతెల్లమైంది.

జనాభా నైపుణ్యాభివృద్ధితోనే దేశ ప్రగతి

- పలు చోట్ల ప్రపంచ జనాభా దినోత్సవం
- అవగాహన ర్యాలీలు, మానవహారాలు



నగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు



నాగుల్లంక సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మామిడికుదురు: జనాభా పెరుగుదలతో దేశం అభివృద్ధి సాధించినట్టు కాదని, ఆ జనాభా నైపుణ్యంతో కూడిన స్కిల్స్‌ను పెంపొందించుకుంటేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలదని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈదరాడలో ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణకు పాటు పడతామంటూ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, సీహెచ్‌ఓ కె.లావణ్య, హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వర రావు, ఏఎన్ఎం స్వాంతకుమారి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురం: ఎంవీఎన్‌జేఎస్-ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షత వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా రాజోలు సీడీపీఓ వైకేడీ రమాదేవి వ్యవహరించారు. అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో భారత్ నిలిచిందని, జనాభా విస్ఫోటనం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని విశ్లేషించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు నక్క రమేష్‌బాబు, కేబీహెచ్ విజయ్‌కుమార్, రోహేల్‌బాబు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైవీ ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను డాక్టర్ ప్రియాంక వివరించారు. ఎంపీహెచ్‌ఈఓలు ఎ.నాగరాజు, ఎస్.శ్రీనివాసరెడ్డి, పీహెచ్ఎన్ కె.దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక పీహెచ్‌సీ, రామేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సాగిన ఈ ర్యాలీలో వైద్యాధికారులు పీజే గాయత్రి, సీహెచ్.దుర్గాకావ్య, ఎండీ ఎంఏ యూనుస్ వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, సీహెచ్‌ఓ వీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

అంబాజీపేట: దేశ ప్రగతికి జనాభా పెరుగుదల అవరోధమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రావులపాలెం: దేశాభివృద్ధికి జనాభా నియంత్రణ కీలకమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులు ఎస్ చినబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలమూరు: పెదపళ్ల చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లిఖార్జున్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు.

తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయాలు



కొత్తపేట రైతు బజార్‌లో విక్రయాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తపేట: నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నిత్యావసర సరకులను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. గురువారం స్థానిక రైతు బజార్‌లో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయాలను ఆయన ప్రారంభించారు. రైతు బజార్‌లో నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని, రైతులకు, వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దర్శాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ చింతం విజయ కృష్ణమోహన్, వార్డు సభ్యుడు విళ్ల మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

కొత్తపేట: మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం వారు గురువారం విడుదల చేసిన ఫలితాల్లో ఈ పాఠశాలలో చదివి, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నూకపేయి నవనీత్, పప్పుల వెంకటపావని నూజివీడు క్యాంపస్‌కు, కాళ్లకూరి చైతన్య పద్దు ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్టు హెచ్‌ఎం కె.అరుణశ్రీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

సఖినేటిపల్లి: వివిధ జెడ్పీ హైస్కూళ్లలో చదివిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. మోరి జెడ్పీ స్కూలుకు చెందిన జాన లోహిత సాయికోట తేజస్వి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, గుమ్మిడి పూర్ణ వంశీకార్తిక్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో, ఉయ్యూరువారి మెరక జెడ్పీ స్కూలుకు చెందిన కొండా సోనాలి శ్రీకాకుళంలో, అంతర్వేదిపాలెం జెడ్పీ స్కూలుకు చెందిన బొమ్మిడి సంగీత ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని అభినందించారు.